క్లుప్తంగా

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

పెడన: మండల పరిధిలోని మడక పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు జోగి సుబ్బారావు, గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ పాలఉత్పత్తిదారులకు రూ.91,940 బోనస్ పంపిణీ చేశారు.

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: మండల పరిధిలోని రామవరపు మోడి పాల ఉత్పతిదారుల పరస్పర సహాయ సహకార సంఘంలో పాలు పోస్తున్న రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ గుడ్లవల్లేరు చిల్లింగ్ సెంటర్ మేనేజరు టి.సత్యన్నారాయణ బుధవారం బోనస్ పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు గూడవల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 49 మంది రైతులకు బోనస్ రూ.67,924లను అందజేశారు.

ఘనంగా ప్రారంభమైన పోతురాజు సంబరాలు

మోపిదేవి: మోపిదేవి గొడపాలెం రామాలయం వద్ద పోతురాజు సంబరాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఉదయం పోతురాజు శిలలతో ఊరేగింపుగా మేళతాళాలు, డప్పు కళాకారుల సందడితో బయలు దేరిన భక్తులు మోపిదేవి వార్ఫు వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఊరేగింపుగా దారిపొడవునా గ్రామ దేవతలను దర్శించుకుంటూ సంబరాలు నిర్వహించారు.

గూడూరు మండల పరిషత్ ఏఓగా వనజ

గూడూరు: గూడూరు మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారిగా ఎం.వనజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మోపిదేవి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆమె గూడూరుకి బదిలీ అయ్యారు.

12 నుంచి సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు

పెడన: మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పెడన ఎంపీడీవో వి.రెడ్డయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పరిపాలన, విధులు, పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

11న విజయవాడలో రాష్ట్ర పద్మశాలీయుల సమావేశం

ఘంటసాల: విజయవాడలో ఈనెల 11న జరిగే రాష్ట్ర పద్మశాలీయుల సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని కోస్తాంధ్ర పద్మశాలి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగేశ్వరరావు, అందె జగదీష్ పిలుపునిచ్చారు. ఘంటసాల కోస్తాంధ్ర పద్మశాలీయుల కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విజయవాడలోని శ్రీమాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో కోస్తాంధ్ర, రాయలసీమ పద్మశాలీయుల సంఘాల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టండి

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



గూడూరు: గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కోరారు. మండలంలోని రామానుజవత్తర్లపల్లిలో విషజ్వరాలు ప్రబలడంతో బుధవారం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న 48 మంది వైద్య శిబిరానికి వచ్చి వైద్యసేవలు పొందారు. వీరిలో 36 మందికి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ నిర్ధారిత రక్త పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరాన్ని సందర్శించిన పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పరిస్థితిని సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ పి.రాజేశ్వరి, మాజీ డీసీ చైర్మన్ పోతన లక్ష్మీ నరసింహస్వామి పాల్గొన్నారు.

పోలాటితిప్పలో సారా బట్టీలపై సెబ్ దాడులు

కోనేరుసెంటర్: బందరు మండలం పోలాటితిప్ప గ్రామంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా కొక్కిలిగడ్డ బసవయ్య, మోకా వెంకటేశ్వరమ్మ, సున్నపూడి భారతి, ఎం.వెంకటేశ్వరమ్మ సారా కాస్తుండగా పట్టుకుని వారి నుంచి సుమారు 200 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. మరో 200 లీటర్ల పులిసిన బెల్లపుఊటను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. పట్టుబడిన నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సెబ్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. గ్రామంలో ఎవరూ నాటుసారా జోలికి పోకుండా గ్రామ పెద్దలతో కమిటీ వేసి పోలాటితిప్ప గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

తూతూమంత్రంగా తల్లిపాల వారోత్సవాలు



శారదానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ర్యాలీ

- సీడీపీవో సెలవులో ఉండటంతో ఉద్యోగుల నిర్లక్ష్యం
- పట్టించుకోని సూపర్‌వైజర్లు
- నగరంలో చాలా కేంద్రాల్లో అసలు వారోత్సవాల ఊసే లేదు

మచిలీపట్నంటౌన్: స్త్రీ, శిశు సంక్షేమశాఖ మచిలీపట్నం ప్రాజెక్టు పరిధిలో తల్లిపాల వారోత్సవాల నిర్వహణ అంతంత మాత్రంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది మచిలీపట్నం ప్రాజెక్టు పరిధిలో ఈ కార్యక్రమ నిర్వహణపై ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఫలితంగా తల్లిపాల విశిష్టతను క్షేత్రస్థాయిలో తల్లులకు, మహిళలకు వివరించటంలో విఫలమయ్యారు. మచిలీపట్నం నగరం పరిధిలో మొత్తం 79 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. నగరంలోని అన్ని డివిజన్లలో మురికివాడల ప్రాంతంలో ఈ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలు, మహిళలకు తల్లిపాల విశిష్టతను వివరించేందుకు ప్రతి ఏడాది ప్రభుత్వం తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల విశిష్టతను తెలుపుతూ బ్యానర్లు ఏర్పాటు చేసి అవగాహన సమావేశాలతో పాటు ర్యాలీలు నిర్వహించాల్సి ఉంది. కాని ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కార్యక్రమం అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోయింది. చాలా కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహించలేదు. మచిలీపట్నం నగరంతో పోలిస్తే ఇతర ప్రాంతాల్లో కార్యక్రమాన్ని ప్రతిరోజు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించటం గమనార్హం.

పర్యవేక్షకులు ఎక్కడ?

అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న కార్యకలాపాలను, ప్రత్యేక కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తున్నారో పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లు నిఘా పూర్తిగా కొరవడింది. కార్యక్రమం నిర్వహించకపోయినా ఫొటోలకు ఫోజులు ఇచ్చి వాటిని అప్‌లోడ్ చేశారనే ఆరోపణలు వినవస్తున్నాయి. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏ కార్యక్రమం చేసినా పత్రికలకు సమాచారం ఇచ్చి ఆయా కార్యక్రమాల వివరాలను ప్రజలకు తెలిసేలా ఆ శాఖ సిబ్బంది చూసేవారు. కాని ఈ వారోత్సవాలకు సంబంధించిన సమాచారం మీడియాకు ఇవ్వకపోవటం గమనార్హం.

ఈ విషయంపై ఐసీడీఎస్ సీడీపీవో గ్లోరిని వివరణ కోరగా తాను వ్యక్తిగత కారణాలతో సెలవులో ఉన్నానన్నారు. మంగళవారమే విధుల్లో చేరానని తెలిపారు. వివరణ కోరిన అనంతరం ఆమె బుధవారం సాయంత్రం శారదానగర్ ఎస్సీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం, ర్యాలీ నిర్వహించి హాజరుకావటం గమనార్హం. ఈ కార్యక్రమంలో సీడీపీవో గ్లోరితో పాటు సూపర్‌వైజర్ జి.వెంకటేశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.ఝాన్సీరాణి, కె.సౌజన్య, కె.బసవనాగులు, ఏఎన్ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

మోపిదేవి ఆలయ నాయీబ్రాహ్మణులకు మేలు చేస్తాం

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



బుద్ధప్రసాద్‌ని సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు

అవనిగడ్డ: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కేశఖండన శాలలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఇంటి వద్ద ఆయనను ఆలయ కేశఖండనశాల నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌తో పాటు ఆయన తనయుడు యువనేత మండలి వెంకట్రామ్‌ని సంఘం నాయకులు పూలమాల వేసి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆర్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎం.బాల భాస్కరరావు, ఎం.నాంచారయ్య, వి.శివశంకరరావు, ఎస్.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు, ఎ.రాంబ్రహ్మం, టీడీపీ నాయకుడు రావి రత్నగిరి పాల్గొన్నారు.

స్వామివారి నిత్యాన్నదానంకు రూ.50,555 విరాళం



నిత్యాన్నదానంకు విరాళం అందజేస్తున్న దాతలు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి కానూరు గ్రామస్తులు పరుచూరి ఎస్‌వీఎల్ సాయికుమార్, ప్రియాంక దంపతులు రూ.50,555 విరాళంగా అందజేశారు. తొలుత బుధవారం ఉదయం వారు ఆలయానికి చేరుకుని స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను సత్కరించారు.

నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తం

తహసీల్దార్ బి.విజయ ప్రసాద్

శ్రీకాకుళం(ఘంటసాల): కృష్ణానదికి వరద నీరు వస్తున్నందున ఘంటసాల మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ హెచ్చరించారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని కృష్ణానది ప్రాంతాన్ని తహసీల్దార్ విజయ ప్రసాద్ వీఆర్వో తూము శ్రీనివాసరావుతో కలసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల మండలం పరిధిలోని కృష్ణానది పరివాహక ప్రాంతాలైన శ్రీకాకుళం, పాపవినాశనం, గోగినేనిపాలెం గ్రామస్తులు నదీ పరివాహక ప్రాంతాలకు పశువులను, మేకలను, ఇతర వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లొద్దని కోరారు. రెవెన్యూ అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదల వల్ల ఏమైనా సమస్యలు ఉంటే అత్యవసర సహాయం కోసం 1070, 112, 18004250101 టోల్ ఫ్రీ నంబర్లతో పాటు 99086 64645 నంబర్లకు సమాచారం అందించాలని తహసీల్దార్ కోరారు.

ఘనంగా లక్ష్మణస్వామి వర్మ జయంతి వేడుకలు

అవనిగడ్డ: అగ్నికుల క్షత్రియ నేత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ 155వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అగ్నికుల క్షత్రియ సామాజిక భవనంలో అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మణస్వామి వర్మ చిత్రపటానికి పలువురు అగ్నికుల క్షత్రియ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణస్వామి వర్మ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూత్ ఫోర్స్ నాయకులు ఒడుగు నాగార్జున, లంకే యుగంధర్, కోలా బాలాజీ, పి.నాగాంజనేయులు, కోలా వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ నాంచారయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

చోరంపూడిలో...

బంటుమిల్లి: మండల పరిధిలోని చోరంపూడి రామాలయం వద్ద అగ్నికుల క్షత్రియ పితామహుడు పొన్నమండ లక్ష్మణస్వామివర్మ 155వ జయంతి వేడులను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం లక్ష్మణస్వామి సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అభిమానులు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం

మచిలీపట్నంటౌన్: నగరంలో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. బలమైన గాలులతో కూడిన వర్షం కురవటంతో మచిలీపట్నంలో 39.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తెల్లవారుజామున ఒక్కసారిగా గాలులతో కూడిన వర్షం కురవటంతో నగరంలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. ఆ తరువాత పగలంతా అడపాదడపా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. రాత్రికి కూడా జల్లులు పడ్డాయి. రోడ్లపై నీరు చేరటంతో వాహనదారులు, విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

శిశువులకు ముర్రిపాలే శ్రేయస్కరం



చిన్నాపురంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కోనేరుసెంటర్: పిల్లలు పుట్టగానే తల్లులు అందించే ముర్రిపాలు బిడ్డలకు ఎంతో శ్రేయస్కరమని బందరు ఐసీడీఎస్ రూరల్ సూపర్‌వైజర్ ఎ.లక్ష్మి తెలిపారు. బందరు మండలంలోని చిన్నాపురం, కొత్తపూడి, సిరివెళ్ళపాలెం గ్రామాల్లో బుధవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని పలువురు బాలింతలకు సీమంతాలు చేసి పసుపు, కుంకుమను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువు జన్మించిన వెంటనే తొలి దశలో అందించే పాలు బిడ్డ జీవితాంతం ఆరోగ్యంగా, బలంగా ఉండేందుకు దోహదపడతాయన్నారు. విషయ పరిజ్ఞానం లేక కొందరు అన్నీ తెలిసి మరి కొందరు బిడ్డలకు తల్లి పాలు అందించకుండా డబ్బా పాలు తాగిస్తుంటారన్నారు. అది బిడ్డ ఆరోగ్యంపై భవిష్యత్తులో తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. అనంతరం ఐసీడీఎస్‌కు చెందిన కొందరు తల్లిపాల వలన కలిగే ప్రయోజనాలు, తల్లి పాలు లేకుంటే కలిగే అనర్థాలను వివరించారు. కొత్తపూడిలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నాపురంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.కృష్ణకుమారి, ఏఎన్ఎం సుధారాణి, ఆశ, అంగన్‌వాడీ వర్కర్‌లు పాల్గొన్నారు. సిరివెళ్ళపాలెంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎ.లక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

17న అరుణాచలానికి ఆర్టీసీ బస్సు సర్వీస్

మచిలీపట్నంటౌన్: ప్రతి నెలా పౌర్ణమికి భక్తుల సౌకర్యార్థం నడుపుతున్న అరుణాచల గిరి ప్రదక్షిణ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసు ఈ నెల 17వ తేదీన మచిలీపట్నం నుంచి బయలుదేరనున్నట్లు డిపో మేనేజర్ టి.పెద్దిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు మచిలీపట్నం బస్టాండ్ నుంచి బయలుదేరి రేపల్లె మీదుగా అరుణాచలం చేరుతుందన్నారు. 18న దైవదర్శనం, అరుణాచల గిరి ప్రదక్షిణ, అనంతరం కంచి, విష్ణు కంచి, కామాక్షమ్మ గుడి, బంగారు బల్లి, తిరుత్తణి దర్శించుకుని 21వ తేదీన మచిలీపట్నం తిరిగి చేరుతుందన్నారు. ఈ బస్సులో ప్రయాణించేందుకు రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. ఈ బస్సు సర్వీసుకు ఒక్కరికి రూ.3 వేలు చార్జీగా నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని మచిలీపట్నం ప్రాంతవాసులు వినియోగించుకోవాలని కోరారు.

తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

మచిలీపట్నంటౌన్: తల్లిపాలు ప్రతి బిడ్డకు జన్మహక్కు అని, తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం అని స్థానిక వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ అధిపతి డాక్టర్ టి.శివయ్య అన్నారు. స్థానిక లక్ష్మణరావుపురంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ తల్లిపాలు పట్టించటం ద్వారా పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరగటంతో పాటు శిశు మరణాలు నిరోధించగలుతామన్నారు. శిశువుతో పాటు పాలు ఇచ్చే తల్లులకు కూడా ప్రసవానంతరం రక్తస్రావాన్ని నిరోధించటం, రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్లను తగ్గించేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని, అల్పాహారాన్ని అందించారు. కార్యక్రమంలో వైద్యులు సంధ్యారాణి, సుస్మిత, అచ్యుతరామరాజు, శ్రావణి, వై.విజయకృష్ణ, పి.సత్యనారాయణచౌదరి, కె.బలుసులమ్మ, కె.శైలజాదేవి, ఏపీ లీలాకృష్ణ, చిలకలపూడి యూపీహెచ్‌సీ వైద్యులు శ్రావ్య, రాజేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు రంగమ్మ, లత, నాగమణి, రూత్‌మేరీ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కలిగించాలి

బంటుమిల్లి: బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది నిరంతరం అవగాహన కలిగించాలని వక్తలు అన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి సముద్రవేణి, ఎంఈఓ బి.త్రిపుర సుందరీ దేవీ, ఎంపీడీఓ రామకృష్ణరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి సౌందర్య పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, హెల్త్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన మండలాల్లోని పలు గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిడ్డకు పాలు పట్టడం ద్వారా తల్లికి కూడా మేలు

గూడూరు: పుట్టిన శిశువులకు పాలు పట్టడం ద్వారా తల్లికి కూడా మేలు జరుగుతుందని ఐసీడీఎస్ బందరు సీడీపీఓ కె.గ్లోరి అన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని మండలంలోని మల్లవోలులో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు మొదటి 6 నెలలు తల్లిపాలే సంపూర్ణ ఆహారం అన్నారు. తల్లిపాలు ఇవ్వడం ద్వారా శిశువుకు న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడుతాయని పరిశోధనల్లో తేలిందన్నారు. పిల్లల మేధస్సును మెరుగుపర్చడంలో తల్లిపాలు సహాయపడతాయన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా రొమ్ములో గడ్డలు, క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. సూపర్‌వైజర్ జన్ను రేవతి, ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎ.భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, రూపాకుమారి, వెంకటేశ్వరమ్మ, దుర్గాభవాని, వరలక్ష్మి, రజని, వర్కర్లు సునీత, కనకదుర్గ పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి



ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి

గూడూరు: జిల్లాలోని ప్రతి రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.పద్మావతి కోరారు. గూడూరు మండలం రామరాజుపాలెంలో చలవాది సాంబశివరావు వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షాలకు, తుపానులు వంటి ప్రకృతి విపత్తులు సంభవించి పంట నష్టం వాటిల్లినప్పుడు బీమా పొందటానికి ఈ-పంట నమోదు దోహదపడుతుందన్నారు. పండించిన పంట అమ్ముకోవడానికి కూడా ఈ-పంట నమోదు తప్పనిసరి అన్నారు. వ్యవసాయ సిబ్బంది నిర్వహించే ఈ-పంట నమోదు కార్యక్రమానికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గూడూరు మండల వ్యవసాయఅధికారి జి.వి.శివప్రసాద్, వీఏఏ కుమార్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ చిత్రంలో ఎస్పీ గంగాధరరావు

కాంట్రాక్టర్లకు కలెక్టర్ బాలాజీ సూచన

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ కాంట్రాక్టర్లకు సూచించారు. పంచాయతీ రాజ్, జలవనరుల శాఖలు, గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) విభాగాల్లో చేపట్టిన వివిధ పనులకు సంబంధించిన కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల ఇంజినీర్లతో బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు, మీకోసం సమావేశ మందిరం, జెడ్పీ మీటింగ్ హాళ్లలో వేరువేరుగా సమావేశాలు నిర్వహించి పనుల పురోగతిపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీ ల్యాడ్స్, డీఎంఎఫ్, సీఎస్ఆర్, పీఎంజీఎస్‌వై తదితర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిధుల కొరత లేదని పూర్తి చేసిన పనులకు ఎప్పటికప్పుడు సకాలంలోనే చెల్లింపులు చేస్తామన్నారు. ఇందుకోసం సంబంధిత శాఖల ఇంజినీర్లు పనులు పూర్తికాగానే ఎలాంటి ఆలస్యం చేయకుండా పనుల రికార్డింగ్, చెక్ మెజర్మెంట్, బిల్లు పాస్ ఆర్డర్, అప్‌లోడ్ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. బిల్లులు చెల్లింపు కాలేదని ఇంజినీర్లు వారి చుట్టూ కాంట్రాక్టర్లను తిప్పుకోకూడదన్నారు. సాగునీటి కాలువలు, మురుగు కాలువల నిర్మాణంలో కొందరు కాంట్రాక్టర్లు 40 శాతం తక్కువకు టెండర్లు వేస్తున్నారని, ఆ విధంగా వేయమని ఎవరూ చెప్పడం లేదన్నారు. దీనిని బట్టి పరిశీలిస్తే ఎస్ఎస్ఆర్ ధరలు ఎక్కువ ఉన్నాయా అని అనిపిస్తుందన్నారు. ఆ విధంగా తక్కువకు టెండర్లు వేసి కొన్ని పనులు చేసి గిట్టుబాటు కావడం లేదని ఆ తదుపరి పనులు చేయలేమని ఆపేస్తే చాలా తీవ్రంగా పరిగణిస్తామన్నారు. టెండర్లు వేసినప్పుడు పోటీపడి గ్రూపులు ఏర్పడి తర్వాత చేయలేమని ఎవరైనా కాంట్రాక్టర్లు చెబితే అటువంటి వారి నుంచి పూర్తి మొత్తం వసూలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్పీ ఆర్ గంగాధరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి, ఈఈలు శ్రీనివాసరావు, రమణరావు, డ్రెయినేజీ ఈఈ విజయలక్ష్మి, సీపీవో గణేష్, పంచాయతీరాజ్, జలవనరులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల డీఈలు, ఏఈలు, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ పనులను వేగవంతం చేయండి

పెడన: పట్టణంలో ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అన్నా క్యాంటీన్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయం సమీపంలో అన్నా క్యాంటీన్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య ప్రభుత్వం పంపించిన మార్గదర్శకాలకు, డిజైన్‌కు అనుగుణంగా పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో పెడన తహసీల్దారు అబ్దుల్ రహమాన్ మస్తానా, మున్సిపల్ ఏఈ సీతారామాంజనేయులు, ఆర్ఐ మణికుమార్, వీఆర్వోలు, సచివాలయాల కార్యదర్శులు ఉన్నారు.

చేనేత రంగాన్ని కాపాడి ఉపాధి కల్పించాలి



పెడనలో చేనేత దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న గుత్తికొండ కొండలరావు



ఘంటసాలలో ప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న చేనేత సంఘాల నేతలు

పెడన: వ్యవసాయ రంగం తరువాత దేశంలో ప్రధాన రంగం చేనేత రంగమేనని, అటువంటి చేనేత పరిశ్రమ నేడు కుదేలవుతోందని, ఆ రంగాన్ని కాపాడి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉందని దూరదర్శన్ విజయవాడ వార్తా విభాగాధిపతి గుత్తికొండ కొండలరావు అన్నారు. కృష్ణాజిల్లా పెడనలో స్థానిక శ్రీవిఘ్నేశ్వర ప్రార్థన మందిరంలో గుంటూరు యునెస్కో క్లబ్, ఏపీడబ్ల్యూఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొండలరావు మాట్లాడుతూ క్విట్ ఇండియా, విదేశీ వస్తు బహిష్కరణ వంటి అంశాలతో స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత రంగం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. వృత్తి నైపుణ్యం కలిగిన చేనేత కార్మికులు వారి వృత్తికి దూరమై కూలీలుగా మిగిలిపోవడం చాలా బాధాకరమన్నారు. ఏపీడబ్ల్యూఎఫ్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఏపీడబ్ల్యూఎఫ్ కృషి చేస్తోందన్నారు. అనంతరం చేనేతను ధరిస్తాం...అభివృద్ధికి కృషి చేస్తామంటూ సభకు హాజరైన వారందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక మహిళలకు చీరలు, ముక్కుపుడకలు అందజేశారు. పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు రాపోలు ఆనందభాస్కర్, చేనేత నాయకులు సమతం రమణ మహేష్, పిల్లలమర్రి నాగేశ్వరరావు, కొతవరపు రాజేశ్వరి, కట్టా హేమసుందరరావు, ఎ.తాతారావు, పిచ్చుక ఫణికుమార్, ఆలపాటి రాధిక, రామనాథం పరమేశ్వరరావు, లక్ష్మీశైలజ, శివరామప్రసాద్ పాల్గొన్నారు.

ఘంటసాలలో...

ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాల పంచాయతీ ప్రాంగణంలో మండల్ డే, జాతీయ చేనేత దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. కోస్తాంధ్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి అందె జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పంచాయతీ ప్రాంగణంలో మహాత్మా జ్యోతిరావు పూలే, చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య విగ్రహాలకు కోస్తాంధ్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీన దేశంలో బీసీలకు రిజర్వేషన్లు కేటాయిస్తూ మండల్ కమిషన్ నిర్ణయం అమల్లోకి వచ్చిందన్నారు. తద్వారా ప్రతి సంవత్సరం ఈ తేదీన మండల్ డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే చేనేత వస్త్రాలు వాడితే అందరి ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు చేనేత సంఘ నాయకులు, కార్మికులు, బీసీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చేనేత ఐక్యతా ర్యాలీ

గూడూరు: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని కప్పలదొడ్డిలో చేనేత ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న వృద్ధ చేనేత కార్మికులను దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలో వివిధ చేనేత సంఘాల ఆధ్వర్యంలో ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ చేనేత సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా భరత్‌రెడ్డి బాధ్యతల స్వీకారం

బంటుమిల్లి: బంటుమిల్లి తహసీల్దార్‌గా వి.భరత్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా పామర్రు తహసీల్దార్‌గా పనిచేస్తున్న భరత్‌రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి తహసీల్దార్‌గా వచ్చిన రవికుమార్ తిరిగి అదే జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో భరత్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్‌ను ఘనంగా సత్కరించారు.

పెడన: మండల పరిషత్ పరిపాలనాధికారి(అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా జి.శిరీష బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈమె పమిడిముక్కల ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై వచ్చారు.